క్లుప్తంగా

నిరుపేదలకు మెరుగైన వైద్యం



ఎల్వోసీ అందిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మారం: మండలంలోని మేడారం గ్రామానికి చెందిన శ్రీషాన్‌తేజా చికిత్సకు మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎల్వోసీ కాపీ అందించారు. తేజా కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్సపొందుతున్నప్పటికీ నయంకాలేదు. దీంతో మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.1.5 లక్షల విలువైన ఎల్వోసీని బాధిత కుటుంబానికి అందించారు.

కార్యదర్శుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

ఎలిగేడు: మండలంలోని రాములపల్లికి చెందిన తీట్ల అజయ్ అనేవ్యక్తి పంచాయతీ కార్యదర్శి మహేందర్‌రెడ్డి విధులకు ఆటంకం కలిగించాడని, దురుసుగా ప్రవర్తించి దాడిచేసి చేయిచేసుకున్నాడని నిరసిస్తూ మండలపరిషత్ ఎదుట పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది విధులు బహిష్కరించి, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం ఎంపీవో అనిల్ రెడ్డికి వినతిపత్రం అందించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కమాన్‌పూర్: మండలకేంద్రంలోని కురుమ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10లక్షలు నిధులు కేటాయించడాన్ని హర్షిస్తూ గురువారం మండలకేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, జెడ్పీచైర్మన్ పుట్ట మధు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మి, సర్పంచ్ నీలం సరిత, కురుమసంఘం అధ్యక్షుడు నరిగేమల్లేశ్, కోరేబీరయ్య, కొమ్ము చేరాలు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: డివిజన్‌లోని ఆయా మండలాలకు చెందిన 99 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు గురువారం చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి, పాలకుర్తి మండలాలకు చెందిన 89 మందికి కల్యాణ లక్ష్మి, నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 10మందికి సీఎం సహాయ నిధి చెక్కులు అందించారు.

పెరటి కోళ్ల పంపిణీ



పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న పుట్ట మధు

మంథని: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని జెడ్పీచైర్మన్ పుట్ట మధు అన్నారు. గురువారం మండల పరిషత్‌లో జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెరటి కోళ్ల పంపిణీ చేశారు. గతంలో పుట్ట లింగమ్మ ట్రస్టు ద్వారా ఎంతో మందికి పెరటి కోళ్ల పంపిణీ చేశామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ సభ్యురాలు తగరం సుమలత, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్‌కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు

ఎలిగేడు: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ప్రతిభ పోటీలు నిర్వహించినట్లు ఆర్గనైజర్స్ తాటిపల్లి సతీశ్‌బాబు, అడ్డగుంట శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మండలకేంద్రంలోని జెడ్పీపాఠశాలలో వైస్‌ఎంపీపీ బుర్ర వీరస్వామి గౌడ్ సౌజన్యంతో ఇటీవల నిర్వహించిన ప్రతిభా పోటీలు వ్యాసరచన, క్విజ్, ముగ్గుల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను గురువారం అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యనారాయణ, ఎస్సెమ్సీ చైర్మన్ మండల శ్రీశైలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘ఆరోగ్య మహిళ’కు ఆదరణ

- యూపీహెచ్‌సీలో పెరిగిన మహిళల ఓపీ
- విస్తృత ప్రచారంతో మరింత చేరువలో
- టీ–హబ్ ద్వారా అన్నిరకాల ఆరోగ్య పరీక్షలు



రామగుండం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రామగుండం: ‘ఆరోగ్య మహిళ’ పేరుతో మహిళల ఆరోగ్య సమస్యలను నయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కొన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలను గుర్తించింది. జిల్లావ్యాప్తంగా మూడు పీహెచ్‌సీలను గుర్తించిన వైద్యశాఖ ఇందులో అబాది రామగుండంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కానుకగా ప్రకటించింది. వారంలో ఏదో ఒకరోజు మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రత్యేకంగా వైద్యసేవలు అందించి, మెరుగైన ఆరోగ్య పరీక్షల నిర్వహణకు జిల్లా కేంద్రంలోని టీ–హబ్‌ను వినియోగించుకోవాలని ఆదేశించింది. ఇందులో భాగంగా అబాది రామగుండం యూపీహెచ్‌సీలో ప్రతీ మంగళవారం మహిళలకే ప్రాధాన్యమివ్వడంతో తొలివారం 58 మంది ఔట్ పేషెంట్లుగా నమోదు చేసుకోగా భవిష్యత్‌లో వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

అబాది రామగుండం యూపీహెచ్‌సీ పరిధి

పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం (యూపీహెచ్‌సీ)లో వైద్యాధికారితో పాటు 21మంది సిబ్బంది ఉన్నారు. ఇందులో స్టాఫ్‌నర్స్, ఫార్మాసిస్టు, అకౌంటెంట్‌తో పాటు క్షేత్ర సిబ్బంది ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లున్నారు. కార్పొరేషన్ పరిధిలోని 1,3,4,6,20,21,22 డివిజన్ల పరిధిలోని 40వేల మంది ప్రజలకు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆరోగ్యసేవలు అందిస్తుంటారు.

రోగ నిర్ధారణతో సమస్యలు పరిష్కారం...

మహిళలు ఎన్నోరకాల వ్యాధులతో సతమవుతుంటారు. ఈ క్రమంలో రోగ నిర్ధారణతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఇందుకు రూ.వేలల్లో విలువ చేసే పరీక్షలను ఉచితంగా చేసేందుకు టీ–హబ్ ద్వారా డయాగ్నోసిస్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. దీంతో రుతుక్రమ సమస్యలు, గర్భకోశ వ్యాధులు, హృదయ స్పందన వ్యా ధులు, డయాబెటీస్, రక్తపోటు, బ్రెస్ట్‌క్యాన్సర్, రక్తహీనత, బరువు తగ్గడం, విటమిన్, ఐరన్ లోపాలు తదితర వ్యాధులకు సంబంధించిన అన్ని పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు.



మహిళలకు బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది



యూపీహెచ్‌సీలో అందుబాటులో మందులు

జీవనశైలిలో మార్పులతో అనేక సమస్యలు



జీవన శైలిలో మార్పులతో మానసిక రుగ్మతలు తలెత్తుతుంటాయి. ఈ క్రమంలో మహిళలు అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతుంటారు. మహిళలు కుటుంబపోషణ గురించి నిత్యం ఆలోచిస్తూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. సమయానికి భోజనం చేయకపోవడం, సాధారణ వ్యాధులపై నిర్లక్ష్యం, మానసిక ఒత్తిడి, ఆర్థిక సమస్యలు, మానసిక రుగ్మతలు తదితర సమస్యలు పట్టించుకోకపోవడంతో చివరికి నయంకాని వ్యాధిగా మారుతుంది. ఇలాంటి వాటిని ప్రాథమిక దశలో గుర్తించి ఆరోగ్యం కాపాడుకునేందుకు యూపీహెచ్‌సీలో సేవలను అందుబాటులోకి తెచ్చాం.

– డాక్టర్ మాధురి, యూపీహెచ్‌సీ, రామగుండం

అందుబాటులో నాణ్యమైన పరీక్షలు



యూపీహెచ్‌సీలో మహిళలు తమ ఆరోగ్య సమస్యలను తెలియజేస్తే వైద్య సిబ్బంది తమ శాంపిల్స్ జిల్లా కేంద్రంలోని టీ–హబ్‌కు పంపిస్తారు. రెండు రోజుల్లో రిపోర్టు వస్తుంది. పీహెచ్‌సీల నుంచి వచ్చే వివిధరకాల నమూనాలను పరీక్షించి డయాగ్నోసిస్ రిపోర్టు అందిస్తారు. దాని ప్రకారం డాక్టర్లు రోగులకు మందులు అందిస్తారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కృపాబాయి, డిప్యూటీ జిల్లా వైద్యాధికారి

తప్పనున్న ఆర్థిక భారం



వైద్యసేవలకు ముందు డాక్టర్లు రక్త పరీక్షలు చేయడం పరిపాటి. రూ.వేలల్లో డబ్బులు చెల్లించి పరీక్షలు చేయించుకునే స్తోమత లేక ఆర్థిక భారంతో ఏదో మొక్కుబడిగా మందులు వాడుతున్నాం. టీ హబ్ ద్వారా ఉచిత రోగనిర్ధారణ పరీక్షలతో ఆర్థికంగా ఇబ్బందులు తప్పినట్లే. యూపీహెచ్‌సీలో లేడీ డాక్టర్‌ను అందుబాటులో ఉంచడం మహిళలకు ఊరట కలిగిస్తుంది.

– బొద్దుల లక్ష్మి, అబాది రామగుండం మహిళ

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: తెలంగాణ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుంటే కొందరు తుపాకి రాముళ్లు ఊళ్లల్లోకి వచ్చి ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జీవో 58, 59 కింద ఇళ్లపట్టాలు, కల్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. ప్రజా సంక్షేమ కోసం ప్రభుత్వం సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేయడం ద్వారా ప్రతీ ఇంటికి లబ్ధి జరిగిందన్నా రు పదవిలో ఉన్నప్పుడు ఎం చేయని ఓ ప్రజాప్రతినిధి ఇప్పుడు ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను విస్మరించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఒకప్పుడు ఊళ్లోకి తుపాకి రాముడు వచ్చి మాట్లాడినట్లు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీరావు, రైతుబంధు సమితి కన్వీనర్ అనంతరెడ్డి, ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ యాకన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా పార్టీ...

కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త ఇటీవల ప్రమాదవశాస్తు చనిపోగా పార్టీ సభ్యత్వ ప్రమాదబీమా రూ.2లక్షల చెక్కును బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. సర్పంచ్ విజేందర్‌గౌడ్, ఎంపీటీసీ శీలం శంకర్ తదితరులున్నారు.

ప్రయోగాత్మక విద్యతో సత్ఫలితాలు



ప్రయోగాత్మకంగా బోధిస్తున్న జిల్లా సైన్స్ అధికారి

కాల్వశ్రీరాంపూర్: సంచార విజ్ఞాన గణిత ప్రయోగశాలతో సత్ఫలితాలు వస్తున్నాయని ఎంఈవో ఆరెపల్లి రాజయ్య అన్నారు. విద్యార్థులు ప్రయోగాత్మకంగా నేర్చుకుంటూ పఠనాసక్తిని పెంచుకుంటున్నారని కొనియాడారు. కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాల మోడల్ స్కూల్లో గురువారం సంచార విజ్ఞాన గణిత ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక బోధనతో శాస్త్రీయ దృక్పథం తదితర అంశాలపై జిల్లాసైన్స్ అధికారి రవినందన్‌రావు అవగాహన కల్పించారు. పాఠ్యపుస్తకాల్లోని కఠినమైన అంశాలను సులువుగా అర్థమయ్యేలా బోధించారు. రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, గణితంలో 60కి పైగా అంశాలను బోధించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, రిసోర్స్‌పర్సన్లు జి.వెంకటరమణ, పురుషోత్తం, కిషన్‌రావు, రహీం, సంతోష్‌కుమార్, వెంకటపతి, చాంద్‌పాషా, పీజీటీలు అశోక్, కుమార్, శ్రీనివాస్, ప్రసాద్, కిరణ్, సుమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు



కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లిలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.



సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని చిన్నకల్వల(ఉప్పరపల్లి)లో శ్రీశివ పంచాయతన సహిత కేతాలమ్మ మేడాలమ్మ సహిత మల్లిఖార్జునస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు చేశారు. యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కుట్టుశిక్షణ ప్రారంభం

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో సింగరేణి సంస్థ ఓసీపీ–1, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ, మగ్గంవర్క్ కేంద్రాన్ని గురువారం ఆర్జీ–3 పర్సనల్ జీఎం మారుతి ప్రారంభించి మాట్లాడారు. మహిళల కోసం ఉచితంగా ఏర్పాటుచేసిన కుట్టుశిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ బొల్లపెల్లి శంకర్‌గౌడ్, ఎన్వీరాన్‌మెంట్ అధికారి కిషన్ పాల్గొన్నారు.

విచారణ చేపట్టాలి

కోల్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగానికి రూ.కోట్లాది నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన అడ్రస్‌లేని వాహనాలపై పారదర్శకంగా విజిలెన్స్ విచారణ చేపట్టాలని సీపీఐ నాయకుడు మద్దెల దినేశ్ కోరారు. ఉన్న రేట్లకంటే 30 నుంచి 40 శాతం అధిక రేట్లతో 2021లో కొనుగోలు చేశారని ఆరోపించారు. ఇప్పటికే చాలా వాహనాలు మూలకుపడ్డాయని, వీటిపై తప్పుడు బిల్లులు సృష్టించి అక్రమంగా డబ్బులు దండుకున్నారన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

సుల్తానాబాద్: పొట్టి శ్రీరాములు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కొమురవెల్లి రామ్మూర్తి, అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, పల్లా శ్రీనివాస్, ఎల్లంకి రాజన్న, అల్లంకి లింగమూర్తి, సిరిపురం రమేశ్ ,రామిడి శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ యాంసాని రమాదేవి, జైశెట్టి సుమలత, బాదం వాణి, రామిడి హాసిని,శివలీల, కొమురవెల్లి సుజాత, కళావతి పలువురు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల సర్వే

పెద్దపల్లిరూరల్: మండలంలోని రాఘవాపూర్‌లో గాయత్రీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా గురువారం ఇంటింటా సర్వేచేపట్టారు. గ్రామీణ ప్రాంత ప్రజల జీవనవిధానం ఎలా ఉంది. అనే అంశంపై సర్వే చేసినట్లు ప్రోగ్రాం అధికారి సమద్ తెలిపారు. కుటుంబపోషణ కోసం చేస్తున్న పని, సంపాదిస్తున్న వేతనం ఖర్చుపొదుపు తదితర అంశాలపై సర్వేసాగిందన్నారు. పక్కా ప్రణాళికలతో ముందుకు సాగితేనే కుటుంబ ఆనందంగా గడుస్తుందని తేలిందని వివరించారు.

బీఆర్‌ఎస్ జెండా పండుగ



జెండాను ఎగురవేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ధర్మారం: మండలంలోని కమ్మరిఖాన్‌పేటలో గురువారం బీఆర్‌ఎస్ జెండా పండుగ ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సహకార సంఘాల జిల్లా చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పత్తిపాక సింగిల్‌విండో చైర్మన్ నోముల వెంకటరెడ్డి, హాజరయ్యారు. గ్రామాధ్యక్షుడు ఉప్పుల శ్రీనివాస్ జెండా ఎగురవేశారు. రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు దేవి వంశీ, రామిడి నిరంజన్‌రెడ్డి, తాడ్వాయి నర్సింహరెడ్డి, దాసరిప్రేమ్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నాం!

- అధికారులు గైర్హాజరుపై ఆగ్రహం
- అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలి : ఎంపీపీ రాసకొండ లక్ష్మి



అధికారుల తీరుపై మండిపడుతున్న సర్పంచ్

కమాన్‌పూర్: గ్రామానికో క్రీడామైదానం ఏర్పాటుచేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఏర్పాటు చేశామని నేటి వరకూ క్రీడామైదానాలకు సంబంధించిన బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాసకొండ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశానికి డివిజన్ స్థాయి అధికారులు హాజరుకాకపోవడంతో అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలున్నప్పటికీ పట్టించుకోవడం లేదని గుండారం సర్పంచ్ ఆకుల ఓదెలు విద్యుత్ అధికారులపై మండిపడ్డారు. గ్రామాల్లో ఇష్టానుసారంగా మిడిల్ పోల్స్ వేస్తున్నట్లు సమాచారం ఇవ్వడం లేదన్నారు. చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలున్నాయని, వాటిని సరిచేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. మిషన్‌భగీరథ పైపులైన్ పూర్తికాక పోవడంతోపాటు ఇటీవల నిర్మించిన వాటర్ ట్యాంక్‌లకు కనెక్షన్ ఇవ్వకపోవడంతో గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది ఎదురవుతున్నాయని మిషన్ భగీరథ ఏఈ మధును ఎంపీటీసీ బోనాల వెంకటేశ్ నిలదీశారు. ఉపాధిహామీ పథకంలో రహదారులు, చెరువులు, కాల్వగట్ల వెంట ఆయిల్ పామ్ మొక్కలు నాటేలా జీపీలకు అనుమతులివ్వాలని కోరారు.ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ, పీఏసీఎస్ చైర్మన్లు దాసరి రాయలింగు, ఇనగంటి భాస్కర్‌రావు, సర్పంచ్‌లు బొల్లపెల్లి శంకర్‌గౌడ్, తాటికొండ శంకర్, కట్కం రవీందర్, నీలం సరిత, ఇటవేన కొమురమ్మ, శీలారపు అనిత, ఎంపీటీసీలు కోలేటి చంద్రశేఖర్, శ్రీనివాస్, అబ్బడి వినోద, ఎంపీడీవో విజయ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: దళిత హక్కుల సాధనకు ఉద్యమించాలని సీపీఐ జిల్లా నాయకుడు బండి శంకర్‌గౌడ్అన్నారు. గురువారం దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రథమ మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా బడ్జెట్లో నిధులు పెంచాలన్నారు. రాజకీయ జోక్యం లేకుండా దళిత బంధు పథకం అమలు చేయాలని పేర్కొన్నారు. ఈనెల 31న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ పీజీపీఆర్‌సీడీఈ హాల్‌లో జరిగే దళిత హక్కుల పోరాట సమితి ప్రథమ మహాసభలో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వేగోళం శంకర్‌గౌడ్, కలువల రాహుల్, పోషవేని రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక

- రాత్రి వరకు సాగిన కార్యక్రమం
- ప్రజాప్రతినిధుల భర్తలకు ప్రాధాన్యంపై విమర్శలు



లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అధికారులు

గోదావరిఖని: డబుల్‌బెడ్రూం లబ్ధిదారుల ఎంపిక గురువారం స్థానిక సింగరేణి కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. నియోజకవర్గంలో 660 డబుల్ బెడ్రూం ఇళ్లకు 7,632 దరఖాస్తులు రాగా అందులో 2,468 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో లక్కీడ్రాలో 660 మందిని ఎంపిక చేసే ప్రక్రియ చేపట్టారు. గురువారం ఉదయం చేపట్టిన లాటరీ డ్రా రాత్రివరకు కొనసాగింది. రిజర్వేషన్, క్యాటగిరీ ప్రకారం లబ్ధిదారుల ఎంపిక చేశారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ లక్ష్మినారాయణ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటమాధవరావు, రామగుండం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు, తహసీల్దార్ జాహెద్‌పాషా, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి గొడవలు జరగకుండా గోదావరిఖని ఏసీపీ గిరిప్రసాద్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ సీఐ ప్రసాదరావు భారీ పోలీ సుబందోబస్తు నిర్వహించారు. కార్యక్రమానికి మహిళా ప్రజాప్రతినిధులస్థానంలో భర్తలను స్టేజీపైకి పిలవడంతో తీవ్ర విమర్శలు వచ్చాయి. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి

యైటింక్లయిన్‌కాలనీ: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని గ్రామ ప్రత్యేకాధికారి భాస్కర్ తెలిపారు. గురువారం రామగిరి మండలం వెంకట్రావ్‌పల్లి జీపీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి పలు తీర్మానాలు చేశామన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చుట్టూ ఆర్జీ–2 సింగరేణి ఆధ్వర్యంలో కడుతున్న గోడలను అడ్డుకోవాలని సూచించారు. స్కూల్ సమీపంలో పాఠశాలను ఆనుకొని నిర్మిస్తున్న వర్క్‌షాపుతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందన్నారు గ్రామంలో మరుగుదొడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి రమ, నాయకులు, బూడిద సమ్మయ్య, బుర్ర ముత్యాలగౌడ్, సదానందం, తిరుపతి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ జాతీయస్థాయి విజేతలకు సత్కారం



దాసరి హర్షిత, చందనాపూర్



ఎం.పూజశ్రీ, సుల్తానాబాద్

పెద్దపల్లిరూరల్: జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో విజేతలుగా నిలిచిన దాసరి హర్షిత, ముస్త్యాల పూజశ్రీకి రాష్ట్రపతిభవన్‌లో నిర్వహించే కార్యక్రమానికి ఆహ్వానం అందినట్లు డీఈవో మాధవి తెలిపారు. 9వ జాతీయస్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో రామగిరి మండలం చందనాపూర్ జెడ్పీహైస్కూల్ విద్యార్థిని దాసరి హర్షిత, సుల్తానాబాద్ అల్ఫోర్స్ విద్యార్థిని ముస్త్యాల పూజశ్రీకి ఏప్రిల్ 10 నుంచి 13వ తేదీవరకు రాష్ట్రపతిభవన్‌లో ఎన్‌ఐఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ (ఫైన్–2023) లో పాల్గొనేందుకు ఆహ్వానం అందిందని డీఈవో వివరించారు. జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలో ప్రతిబింబించిన విద్యార్థులను అభినందించారు.